సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 30 । నవంబర్ । 2023



లక్ష పుష్పార్చన

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన చేశారు. 8లో



మావుళ్లమ్మకు సారె

భీమవరం (ప్రకాశంచౌక్) : మావుళ్లమ్మవారి మండల దీక్షధారులు అమ్మవారికి సారె సమర్పించారు. ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు. 8లో



జాతీయ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్: జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్కే అలీష (ఏలూరు) ఎంపికయ్యాడు. వచ్చేనెల 3 నుంచి పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు. 8లో

న్యూస్‌రీల్

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రూ.1,072 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పరిశ్రమలకు వర్చువల్‌గా బుధవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. దీనిలో భాగంగా తణుకు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఎంఎస్ఈసీడీపీ స్కీమ్ కింద రూ.9.87 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేశారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, తణుకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంటు వంకా రాజకుమారి, అధికారులు, అసోసియేషన్ సభ్యులు కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రోత్సాహంతో పాటు సింగిల్ విండో ద్వారా ఒక్కరోజులోనే అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. తణుకు ఇండస్ట్రియల్ పార్కుకు రూ.9.87 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ తహసీల్దార్, ఉభయగోదావరి జిల్లాల ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్ వైవీకే సుబ్బారావు, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ అధికారి జె.శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రుణాలపై అవగాహన



మాట్లాడుతున్న డివిజనల్ ఆఫీసర్ శంకర నారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ డీసీసీబీ మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం ఖాతాదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. భీమవరం డివిజినల్ ఆఫీసర్ జి.శంకర నారాయణ, బ్రాంచ్ మేనేజర్ యర్రా దుర్గారావు సదస్సులో మాట్లాడుతూ డీసీసీబీ అందిస్తున్న పలు పథకాలను వివరించారు. అనుబంధ రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారు రుణాలు, సొసైటీ ద్వారా ఇచ్చే ఇతర రుణాలు గురించి అవగాహన కల్పించారు. డీసీసీబీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాపారి ఇంట్లో ఈడీ సోదాలు

భీమవరం: పట్టణంలో ప్రముఖ వ్యాపారి ఇంట్లో బుధవారం ఈడీ సోదాలు నిర్వహించింది. గతంలో భారీ ఎత్తున వ్యాపారం నిర్వహించడమేగాక వ్యాపార సంఘంలో పెద్దస్థాయి పదవులు నిర్వహించిన వ్యాపారి నివాసంలో విశాఖ నుంచి వచ్చిన ఈడీ ఉన్నతాధికారితోపాటు 10 మంది సిబ్బంది సోదాల్లో పాల్గొన్నట్లు సమాచారం. వ్యాపారి బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమకావడంతో ఈడీ అధికారులు అనుమానంతో గోప్యంగా సోదాలు చేసినట్టు ప్రచారం సాగుతోంది.

లాభసాటి వరి వంగడాల సాగును ప్రోత్సహించాలి

భీమవరం: రైతులకు లాభసాటిగా ఉండే వరి వంగడాలను సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సలహా సంఘం, ట్రేడర్స్, మిల్లర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి ప్రాంతాలకు అనుగుణంగా అనువైన రకాలకు క్లస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. 150 ఎకరాల వరకు క్లస్టర్‌గా నిర్ణయించుకుని నాణ్యమైన ఎగుమతికి అనువైన రకాలు పండించాలన్నారు. ఎగుమతికి అనుకూలమైన ఎంటీయూ 1010 రకాన్ని భీమవరం, నరసాపురం, మార్టేరు సబ్ డివిజన్‌ల్లో పండించవచ్చన్నారు. పాలకొల్లు, పోడూరు, భీమవరం ఎంటీయూ 1,010, 1,156, 1,153 పండించడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. పోడూరులో పీఆర్-126 వంగడం సాగుకు అనుకూలమన్నారు.

గూడెంకు అదనపు జిల్లా కోర్టు మంజూరు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంకు అదనపు జిల్లా కోర్టు మంజూరైనట్టు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఎంతో కాలంగా ప్రజలు , కక్షిదారులు, న్యాయవాదులు దీని కోసం ఎదురుచూస్తున్నారు. మంత్రి కృషితో ఈ కోర్టు ఏర్పాటు కానుంది. పట్టణానికి రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజన్ తీసుకొచ్చిన ఘనత కూడా మంత్రి కొట్టుకే దక్కింది. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెంతకు వచ్చి.. సమస్యలు తీర్చి

గడపగడపకూ సంక్షేమం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారం
- సచివాలయానికి రూ.20 లక్షలు
- జిల్లాలో 396 సచివాలయాల్లో కార్యక్రమం పూర్తి
- 1,329 ప్రాధాన్య పనులకు రూ.55.44 కోట్ల మంజూరు
- ప్రతిపాదనల్లో మరో 372 పనులు
- 524 పనులు పూర్తి, నిర్మాణ దశలో 707 పనులు



నరసాపురం మండలం చిట్టవరంలో సామాజిక భవనం



కొప్పర్రు పెద్దపేటలో కాలువ రేవు



తాడేపల్లిగూడెం 15వ వార్డులో సీసీ రోడ్డు

సాక్షి, భీమవరం: సంక్షేమ లబ్ధిని గడప చెంతకే చేరవేస్తున్న ప్రభుత్వం అభివృద్ధి పనుల్లోనూ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమంలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తోంది. అందుకోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే 396 గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్యక్రమం పూర్తికాగా 1,329 ప్రాధాన్య పనులకు రూ.55.44 కోట్లు మంజూరయ్యాయి. జీజీఎంపీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్తున్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి వారికి అందిన లబ్ధిని వివరిస్తూనే వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. స్థానికంగా వచ్చిన వినతుల్లో సంక్షేమంతో పాటు తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, కల్వర్టులు, కమ్యూనిటీ హాళ్లు, ఇతర మౌలిక, సామాజిక అవసరాలను గుర్తిస్తున్నారు. ప్రజలకు ప్రాధాన్య అవసరాలను ఎంపిక చేస్తున్నారు. సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను కలెక్టర్ అనుమతితో ఆయా సమస్యల పరిష్కారానికి వెచ్చిస్తున్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

జిల్లాలోని భీమవరం, నరసాపురం, ఆచంట, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల పరిధిలో 535 సచివాలయాలు ఉన్నాయి. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికే 396 సచివాలయాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో గుర్తించిన ప్రజా అవసరాలకు సంబంధించి 1,329 ప్రాధాన్య పనులకు రూ.55.44 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే వీటిలో 524 పనులు పూర్తి కాగా 707 పనులు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. 98 పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా మరో 372 పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలోని నరసాపురం, తాడేపల్లిగూడెం, ఆచంట నియోజకవర్గాల్లో ఇప్పటికే జీజీఎంపీ కార్యక్రమం పూర్తి కాగా మిగిలిన నియోజకవర్గాల్లోను కార్యక్రమం పూర్తిచేసే పనిలో నేతలు నిమగ్నమై ఉన్నారు.

కాలువ రేవుల నిర్మాణం



కాలువకు రేవులు లేక చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రమాదాలూ జరిగేవి. గతంలో పలుసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మా కాలనీకి వచ్చినప్పుడు సమస్యను చెప్పగానే వెంటనే స్పందించి రేవులు నిర్మించారు.

–నల్లి భాగ్యలక్ష్మి, కొప్పర్రు పెద్దపేట, నరసాపురం రూరల్

మురుగు వెతలు తీర్చారు



ఎన్‌టీఆర్ కాలనీలో డ్రెయిన్ లేక మురుగు సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు తెలపగా ఆయన స్పందించారు. జీజీఎంపీ నిధులు రూ.లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించారు.

– గుబ్బల వీరబ్రహ్మం, తూర్పుపాలెం, పోడూరు మండలం

సర్వత్రా హర్షం

గతంలో పదేపదే తిరిగినా తాము ఎన్నుకున్న పాలకులు దొరకని పరిస్థితి ఉండేది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాలకులే ప్రజల వద్దకు వస్తున్నారు. ప్రజల సమస్యలు ఆలకించి సత్వర పరిష్కానికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా తమను పట్టి పీడిస్తున్న సమస్యలను మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఇంటి వద్దకే వచ్చి పరిష్కరిస్తుండటంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా తమను వేధించిన సమస్యలు గడపగడపకు కార్యక్రమంతో తీరుతున్నాయని చెబుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మించారు



మా వార్డులో రోడ్డు గోతులతో అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేది. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మా వార్డు పర్యటనకు వచ్చినప్పుడు ఆయన తెలపగా జీజీఎంపీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించారు.

–దూద్ బాషా, 15వ వార్డు, తాడేపల్లిగూడెం

గడపగడపకు కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులు

నియోజకవర్గం	పనులు	విలువ (రూ.కోట్లలో)
ఆచంట	346	11.63
భీమవరం	61	2.30
పాలకొల్లు	271	12.34
నరసాపురం	216	11.68
తాడేపల్లిగూడెం	116	3.88
తణుకు	67	3.94
ఉండి	186	7.27
ఉంగుటూరు (గణపవరం)	66	2.39

పేద రైతులకు హక్కుల వరం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి, చీఫ్ విప్ ముదునూరి, గుడాల గోపి

యలమంచిలి: స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా ఏ ప్రభుత్వానికీ పేదలకు భూమి హక్కు కల్పించాలనే ఆలోచన రాలేదని, సీఎం జగన్ సర్వహక్కులూ కల్పిస్తూ పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకున్నారని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. యలమంచిలిలో బుధవారం డీ ఫాం పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్కీమ్‌ల ప్రభుత్వం కావాలో.. స్కామ్‌ల ప్రభుత్వం కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. డీ ఫాం పట్టాలివ్వడం ద్వారా భూములన్నీ ఆన్‌లైన్‌లో కనిపిస్తాయని, రుణాలు మంజూరవడంతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. యలమంచిలి మండలంలో కనకాయలంక, పెదలంక, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక గ్రామాల్లో 271 మంది రైతులకు 110 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ గతంలో పట్టా భూములున్న రైతుల కష్టాన్ని గుర్తించిన సీఎం జగన్ భూమిపై హక్కు కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు మాట్లాడుతూ సీఎం జగన్ వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రశాంతి



హెలీప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేనెల 8న భీమవరం పర్యటన సందర్భంగా హెలీప్యాడ్, సభాస్థలికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం హెలీప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత విష్ణు కాలేజీ రోడ్డు మారుతి సుజుకి షోరూం దగ్గరలో ఉన్న స్థలాన్ని హెలీప్యాడ్ నిర్మాణానికి పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణంతోపాటు, అంతర్గత రోడ్లను కూడా పకడ్బందీగా నిర్మించాలని ఆదేశించారు. అనంతరం గ్రంధి జూనియర్ కాలేజ్ వెనుక వైపున ఉన్న లేఅవుట్‌ను సభాస్థలి కోసం పరిశీలించారు. విష్ణు కళాశాల దగ్గరలో హెలీప్యాడ్ నుంచి తాడేపల్లిగూడెం రోడ్డులోని బీవీ రాజు విగ్రహం మీదుగా బైపాస్ రోడ్డులో రోడ్ షో ద్వారా ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకుంటారన్నారు. ఈ మేరకు రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. బారికేడింగ్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, ఆర్అండ్‌బీ శాఖ అధికారి బి.లోకేశ్వరరావు, కమిషనర్ బి.శ్యామల, డీఎస్పీ బి.శ్రీనాథ్ ఉన్నారు.

అధికారులతో సమీక్ష

సీఎం జగన్ పర్యటనకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరోగ్యశాఖ, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, విద్యుత్, రవాణా శాఖ తదితర విభాగాల పక్కాగా వ్యవహరించాలన్నారు. విద్యా దీవెన పొందుతున్న విద్యార్థులంతా సభలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలను నోడల్ అధికారిగా నియమించామన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో బందోబస్తుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, యం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేలారే.. రేలా..



కామయ్యకుంట గ్రామం వ్యూ



వారు కాలు కదిపారంటే.. అందరి కళ్లూ వారివైపే ఉంటాయి. వారి డోలు వాయిద్య స్వరాలు ఆహ్లాదంలో ముంచెత్తుతాయి. రేలారే రేల అంటూ రేల పాటలతో చేసే నృత్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. వారి కట్టుబొట్లు.. వేషధారణ.. ప్రత్యేకంగా నిలుస్తాయి. వారే గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులు. గిరిజన సంప్రదాయ నృత్యానికి ఉన్న ఆదరణను కాపాడుకుంటూ.. రాష్ట్రవ్యాప్తంగా జరిగే భారీ కార్యక్రమాల్లో తమ నృత్యాలు ప్రదర్శిస్తూ.. ఆ కార్యక్రమాలకే కళాకాంతులు తెస్తారంటే అతిశయోక్తి కాదు. ఈ గిరిజన సంప్రదాయ నృత్యానికి కేరాఫ్ అడ్రస్‌గా.. కొమ్ము, డోలు నృత్య కళాకారులకు పెట్టింది పేరుగా నిలుస్తోంది ఏలూరు జిల్లా మన్యంలోని కామయ్యకుంట గ్రామం.

- కొమ్ము.. డోలు.. రేల నృత్యం కామయ్యకుంటకే ప్రత్యేకం
- సీఎం, మంత్రుల బహిరంగ సభల్లో ప్రత్యేక ఆకర్షణగా వీరి నృత్యాలు
- గిరిజన సంప్రదాయ నృత్యాలకు జీవం పోస్తున్న కళాకారులు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలతో గ్రామానికి వన్నె

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : అది ముఖ్యమంత్రి హాజరయ్యే సభ అయినా.. ముఖ్య నేతల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యే కార్యక్రమం అయినా.. శుభకార్యాలు అయినా.. అక్కడ ఏర్పాటు చేసే గిరిజనుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముఖ్య నాయకులకు స్వాగతం పలకడం.. వేదికపై తమ నృత్యాలతో సందడి చేయడం.. వారి ప్రత్యేకత. పెద్ద సంఖ్యలో హాజరయ్యే ప్రజానీకాన్ని వారి వేషధారణ, వాయిద్యాలు, కట్టుబొట్లు, నృత్యాలు.. విశేషంగా ఆకట్టుకుంటాయి. ఏలూరు జిల్లా మన్యం ప్రాంతంలోని మారుమూల కుగ్రామం కామయ్యకుంటకు చెందిన ఈ కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ గ్రామం గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులకు పుట్టిల్లుగా వర్ధిల్లుతోంది. ఈ గ్రామానికి చెందిన కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రదర్శనలు ఇస్తూ తమ ఊరి పేరు మార్మోగేలా చేస్తున్నారు. 1,200 మంది జనాభా నివసించే ఈ గ్రామంలో 20 మందికి పైగా కొమ్ము, డోలు నృత్య కళాకారులు ఉన్నారు. తమ పూర్వీకుల నుంచి అందిపుచ్చుకున్న కళకు ఏళ్లతరబడి వీరు జీవం పోస్తున్నారు. మడకం రాముడు అనే గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడి ఆధ్వర్యంలో వీరంతా బృందంగా ఏర్పడి ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఐటీడీఏ ద్వారా శిక్షణ

కామయ్యకుంట గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో గిరిజన సంప్రదాయ నృత్యాల పట్ల ఆసక్తి ఉన్న గిరిజన యువతీ యువకులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణ పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు అన్ని గ్రామాల వారూ నృత్యాలు చేసినా.. కొంతకాలం తర్వాత కామయ్యకుంటకు చెందిన నృత్య కళాకారులే మిగిలారు. వీరు మాత్రమే గత 15 సంవత్సరాలుగా సంప్రదా య నృత్యాలను ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ, గ్రామాల్లోని శుభకార్యాల్లోనూ చేస్తూ వస్తున్నారు. వీరికి డోలు, కొమ్ములతో పాటు దుస్తులను కూడా ఐటీడీఏ సరఫరా చేసింది. రాష్ట్రంలో ఎక్కడ కార్యక్రమాలు జరిగినా కామయ్యకుంట నుంచి గిరిజన సంప్రదాయ నృత్య కళాకారులు హాజరవుతున్నారు. దీంతో కామయ్యకుంట గ్రామానికి కొమ్ము నృత్య కళాకారుల పుట్టిల్లుగా పేరొచ్చింది.



సంప్రదాయ గిరిజన నృత్యాలు చేస్తున్న కామయ్యకుంట గిరిజనులు

పలు జిల్లాల్లో నృత్య ప్రదర్శనలు చేశాం



మారుమూల కుగ్రామానికి చెందిన మేము శ్రీకాకుళం, అరకు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి అనేక ప్రాంతాల్లో మా నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం కామయ్యకుంట పేరు చెబితే కొమ్ము, డోలు నృత్య కళాకారులు గుర్తుకురావడం సంతోషంగా ఉంది.

– మడవి ప్రసాద్, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడు, కామయ్యకుంట

ఐటీడీఏ శిక్షణ అందించింది



మా ఊరికి చెందిన సుమారు 25 మంది కళాకారులకు కేఆర్ పురం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అది సంప్రదాయ నృత్యాలు మరింత లయబద్ధంగా చేయడానికి ఉపయోగపడింది. దీంతో రాష్ట్రంలోనే మా గ్రామానికి మంచి పేరు వచ్చింది.

– కుర్సం సూర్యకుమారి, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారిణి, కామయ్యకుంట

సంప్రదాయాన్ని కాపాడుకుంటున్నాం



అంతరించిపోతున్న మా గిరిజన సంప్రదాయ నృత్యాలను మేము నేటికీ కాపాడుకోవడం ఆనందంగా ఉంది. మారుమూల కుగ్రామంలో ఉన్న మేము గిరిజన సంప్రదాయ నృత్యాల వల్ల రాష్ట్ర నలుమూలల్లో అందరికీ పరిచయమయ్యాం.

– పైదా మల్లేశ్వరరావు, గిరిజన సంప్రదాయ నృత్య కళాకారుడు, కామయ్యకుంట


కళలకు జీవం పోస్తున్నారు



కొండకోనల్లో గిరిపల్లెల్లో జీవించే గిరిజనులు గ్రామాల్లో జరిగే పండుగలు, ఇళ్లల్లో జరిగే శుభకార్యాల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలు చేయడం ఆనవాయితీ. ప్రస్తుత రోజుల్లో సంస్కృతీ సంప్రదాయాలను మరచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి సమయంలో మా గ్రామానికి చెందిన కళాకారులు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తెస్తూ, కళలకు జీవం పోస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది.

– కొవ్వాసి వరలక్ష్మి, ఎంపీటీసీ, కామయ్యకుంట

చాలా గర్వంగా ఉంది



ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల కార్యక్రమాల్లో స్వాగతం పలికేందుకు మారుమూల అటవీ ప్రాంతంలో ఉండే కొమ్ము, డోలు, రేల పాటల కళాకారులుగా మా గ్రామస్తులకు అవకాశం రావడం ఉంతో ఆనందంగా ఉంది. కామయ్యకుంట గ్రామం పేరు మరింత పెరగడం ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

– పెదకం విజయలక్ష్మి, సర్పంచ్, కామయ్యకుంట

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. వారి నుంచి రూ. 12,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

భీమవరం అర్బన్: ఆస్తి కోసం పెద్దమ్మకు కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి ఇచ్చి హత్య చేసిన కేసులో చెల్లి కొడుకుతో సహా మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ చెప్పారు. భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను బుధవారం సీఐ వెల్లడించారు. తోకతిప్పలో అంగ్రాజు మద్దూరి (47)కు ఆమె సోదరి మధ్య ఆస్తి తగాదా ఉంది. మద్దూరికి చెందిన నాలుగు సెంట్ల స్థలాన్ని పెద్దమ్మ మద్దూరి ఖాళీ చేయడం లేదని ఆమెను హతమార్చేందుకు చెల్లి కుమారుడు రామాని నాగార్జున పథకం పన్నాడు. దీనిలో భాగంగా ఈ నెల 25న పెద్దమ్మ మద్దూరికి కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి ఇచ్చాడు. అది తాగిన ఆమె కాళ్లుచేతులు లాగుతున్నాయంటూ పొరుగింటికి వెళ్లి అక్కడ స్పృహతప్పి పడిపోయి మృతి చెందింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసులో చెల్లి కొడుకు రామాని నాగార్జున, మింద్యాల ఏసుబాబు, నక్కా ఏసుబాబులను నిడమర్రులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. హత్య సమయంలో ఉపయోగించిన బైక్, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు, సిబ్బందిని ఎస్పీ రవి ప్రకాష్ అభినందించారు.

లారీని ఢీకొన్న ఆటో

కూలీ దుర్మరణం,
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుగొండ: సిద్ధాంతం వద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ కూలీ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కే గంగవరం మండలానికి చెందిన దంగేరు వాసాల రేవుకు చెందిన రచ్చా ఏడుకొండలు (58), రచ్చా సూరిబాబు, రచ్చా దుర్గారావు, సమ్మిడి ఏడుకొండలు, మారిశెట్టి శ్రీను చేపల పట్టుబడి కూలి పనులకు వెళుతుంటారు. మంగళవారం అర్ధరాత్రి ఆటోలో పనులకు వెళుతుండగా సిద్ధాంతం వద్దకు వచ్చేసరికి హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సూరిబాబు, మారిశెట్టి శ్రీను, రచ్చా ఏడుకొండలుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలిస్తుండగా, ఏడుకొండలుకు మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా మారిశెట్టి శ్రీనును మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుగొండ ఎస్సై ఎస్ఎన్ఎన్వీ రమేష్ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

భీమవరం అర్బన్: చేపల చెరువుకు మేతకట్టే కూలీ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మొగల్తూరు మండలం ముత్యాలపల్లికి చెందిన జల్లా ఏసురాజు (27) భార్య ఉపాధికోసం కువైట్ వెళ్లింది. ఇద్దరు పిల్లలతో ఉంటూ మరో మహిళ మేరీతో సహజీవనం చేస్తున్నాడు. పాతపూసలమర్రులో ఓ చేపల చెరువు మీద మేత కట్టే పనిని మేరీతో కలిసి చేస్తూ షెడ్డులో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి జల్లా ఏసుబాబు మద్యం తాగి షెడ్డులో గదిలో గడియపెట్టుకుని నిద్రపోయాడు. మరో గదిలో నిద్రపోయిన మేరీ బుధవారం ఉదయం ఏసుబాబు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి చెరువు యజమాని సమాచారం అందించింది. అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై బి.మోహన్‌రావు చెప్పారు.

3 నుంచి విఖనస విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో డిసెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు శ్రీభృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహా ముని విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ



రేలంగిలో గ్యాస్ కనెక్షన్‌లు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో బుధవారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కిట్‌లు, కనెక్షన్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పులుపు అక్కమాంబ, గ్రామపార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, సునీల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరికి వినతి...

తణుకు అర్బన్: తూనికలు కొలతల మోసాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు పెరవలి మండలం వశిష్ట వినియోగదారుల సంఘ కన్వీనర్ సలాది ఉదయభాస్కరరావు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి కారుమూరి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పిల్ కొట్టివేత

తాడేపల్లిగూడెం: అభివృద్ధిని అడ్డుకునే విధంగా తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలో రహదారి నిర్మాణంపై టీడీపీ నాయకులు హైకోర్టులో వేసిన పిల్‌ను కోర్టు కొట్టివేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన అందిన సమాచారం ఇలా ఉంది. తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ బైపాస్ రోడ్డు వేయటాన్ని ప్రశ్నిస్తూ హైకోర్టులో పిల్ పడింది. రోడ్ వేయడం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చెయ్యటమే అంటూ ,మంత్రి కొట్టు సత్యనారాయణ భూములకు అనుగుణంగా రోడ్డు వేస్తున్నారనే ఆరోపిస్తూ టీడీపీ ఇన్‌చార్జి పిల్ దాఖలు చేయగా దీనిపై మంత్రి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. రాజకీయకక్షతోనే పిల్ దాఖలు చేశారని వాదించారు. ఇందులో ప్రజా ప్రయోజనం లేదని పిల్ కొట్టివేయడంతో పాటు రాజకీయ కారణాలతోనే పిల్ దాఖలు చేశారని, దాఖలు చేసిన వ్యక్తికి సీజే ధర్మాసనం 59 వేల రూపాయల జరిమానా విధించినట్టు మంత్రి కార్యాలయం బుధవారం రాత్రి తెలిపింది.

జేఎన్‌టీయూ జట్టుకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న శశి యాజమాన్యం

తాడేపల్లిగూడెం: జేఎన్‌టీయు వాలీబాల్, నెట్ బాల్ టీం జట్టుకు శశి ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపికైనట్లు యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. బి.హితేష్ కార్తికేయ, వాలీబాల్ జట్టుకు, యు.యశస్విని నెట్‌బాల్ టీంకు ఎంపికయ్యారు. కర్ణాటకలో డిసెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే పోటీల్లో హితేష్ పాల్గొంటారు. యశస్విని ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుంది. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్, డీన్ సుబ్రహ్మణ్యం, పీడీ. పిఎస్.శేఖర్, బి.నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

ఆలోచనలను పంచుకోవడమే కాంప్లెక్స్ మీటింగ్

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధ్యాయులు తమ ఆలోచనలను పంచుకోవడమే కాంప్లెక్స్ మీటింగ్ ముఖ్య ఉద్దేశ్యమని ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ బోధనలో సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి, సృజనాత్మకత పెంపొందించుకోవడానికి కాంప్లెక్స్ సమావేశాలు ఉపకరిస్తాయన్నారు.

కళాశాల అభివృద్ధికి దాతల తోడ్పాటు అభినందనీయం

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1985-86 సంవత్సరంలో బీకామ్ చదువుకొన్న పూర్వ విద్యార్థులు వాకచర్ల కాంతారావు ఆర్థికసాయంతో సరస్వతి విగ్రహం చుట్టూ ఫెన్సింగ్, పైన ఆచ్ఛాదనతో పాటు, విగ్రహం వద్ద టైల్స్ వేయించారు. ఈ కార్యక్రమంలో అప్పటి పూర్వ విద్యార్థులైన నానాజీ, చలంచర్ల శరభేశ్వరరావు, కుదుళ్ల సత్యనారాయణ, పాయల చక్రవర్తి, అగర్వాల్, మీసాల సత్యనారాయణ వారి మిత్రబృందం పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో నవరత్నాల వెలుగులు

తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తణుకు టౌన్: ప్రతి ఇంటిలోనూ జగనన్న అమలు చేసిన నవరత్నాల వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎంపీపీ రుద్ర ధనరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామలోని 3వ సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలని అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అడ్డా బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డా బాబు, మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, శ్రీనివాసు, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నరశింహమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

ఇరగవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. బుధవారం ఇరగవరం మండలం అయినపర్రు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ సత్తి అఖిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పంచాయతీలో సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంత అవసరమో వివరిస్తు ఇంటింటా ప్రచారం నిర్వహించి బ్రోచర్లు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతల చేపట్టిన తర్వాత పూర్తిస్థాయిలో అవినీతి రహిత పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి లీలా ప్రసన్న, సొసైటి అధ్యక్షుడు సత్తి శ్రీవన్నారాయణ,



ఇరగవరం: అయినపర్రులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



అత్తిలి: గుమ్మంపాడులో ఇంటింటికీ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం అర్బన్: 2వవార్డులో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నాయకులు సత్తి వెంకట రెడ్డి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, ఈవోపిఆర్డీ నరసంహ మూర్తి, కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలి

అత్తిలి: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో మీరంతా అండగా ఉండాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా పైబోయిన వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేసి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ వేగేశ్న ధన సత్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు నేలపాటి సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రంభ సూరిబాబు, మద్దాల శ్రీనివాస్, యాళ్ల సాధు సుందర్‌సింగ్, ఉన్నమట్ల శ్రీను, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

తాడేపల్లిగూడెంఅర్బన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని గుండుబోగుల నాగు అన్నారు. 2వ వార్డులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలందరూ మళ్లీ జగనే రాష్ట్రానికి కావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా వార్డులో జగన్‌చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో 2వ వార్డు ఇన్‌చార్జి మేడపాటి చెల్లారెడ్డి, కొలుకులూరి ధర్మరాజు, చిట్టూరి నాగేంద్ర, చిటికన ప్రసాద్, బొద్దాని శ్రీనివాస్, యజ్జల రాంబాబు, కేసన అశోక్, మున్సిపల్ ఏఎస్‌ఓ సురేష్, బోణం విజయనిర్మల, పైబోయిన వైదేహి, మారిశెట్టి రమణ, పట్నాల గణపతి, వార్డు సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలోని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వీరంపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1.62 కోట్ల కుటుంబాలకు సీఎం జగన్ లబ్ధిచేకూర్చారన్నారు. ఇంటింటికి తిరుగుతున్న సమయంలో ప్రజలు ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారని, తనకెంతో ఆనందాన్నిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ కేతిరెడ్డి మాధవి, ఎమ్పీటీసీ జంపెల్లి సత్యవతి, బుర్ల సుబ్బలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, కేతిరెడ్డి రామచంద్రారెడ్డి, మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాకిరెడ్డి నెహ్రూరెడ్డి, ఈవోపీఆర్‌డీ బి.ఫణికుమార్, గృహసారథులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

తణుకు అర్బన్: పేద, మధ్యతరగతి వర్గాలందరికీ జగనన్న సృష్టించిన సంక్షేమం పారదర్శకంగా అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 10, 20 వార్డుల్లో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ జగనన్న పేదవర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా నవరత్నాలను సృష్టించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జల్లూరి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్:వీరంపాలెం సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్



తణుకు టౌన్: దువ్వ గ్రామంలోని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



తణుకుఅర్బన్: 10వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

అత్తిలి: బాధలో ఉన్న సాటివారిని ఓదార్చి, సాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. అత్తిలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం బుధవారం బల్లిపాడు గ్రామంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడారు. శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ వైద్యనిమిత్తం సాయం, విద్యార్థులకు ఫీజులు కట్టి చదివించడం, రక్తదాన శిబిరాలు, ఫ్రీజర్‌బాక్సులు, శాంతి రథాలు, అంబులెన్సులు సమకూర్చడం, మొక్కలు పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, నైతిక విలువలపై అవగాహన కల్పించడం మానవతా చేస్తున్న అత్యుత్తమ సేవలని అన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ ఆనాల ఆదినారాయణ, మానవతా అధ్యక్షుడు బోడపాటి సూర్యచంద్రరావు, కార్యదర్శి కొరిపల్లి హరి, కోచైర్మన్ కంకటాల సతీష్, కన్వీనర్ తోట సుబ్బారావు, గ్రామ ప్రముఖులు ఆకుల పండుస్వామి, గారపాటి ధర్మయ్య, ధనుమూరి తాతాజీ, తోట గణేష్, ఎంపీటీసీ సభ్యులు ప్రగడ నాగేశ్వరరావు, నిడదవోలు రవికాంత్ పాల్గొన్నారు.



బల్లిపాడులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

దర్శిపర్రులో పౌరహక్కుల దినోత్సవం

పెంటపాడు: పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రతి వ్యక్తి తప్పక పాటించాలని తహసిల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. దర్శిపర్రు సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యులు ,మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సమస్యలను పట్టించుకోలేదన్నారు. అప్పట్లో పౌరహక్కుల దినోత్సవాలు సరిగా నిర్వహించలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎస్సీలపై ప్రేమతో అధికారులకు ఆదేశాలు ఇచ్చి ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలు ఖచ్చితంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, గూడెం ఏఎస్‌డబ్ల్యూవో వెల్ఫేర్ అధికారి రామలింగం, కార్యదర్శి రామారావు, ఎస్సీ నాయకులు ఉన్నమట్ల ఏసురత్నం, వీరవల్లి సునీల్, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, బి. కిశోర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు, తదితరులు

ఎయిర్‌ఫీల్డ్ భూముల నివాసితుల స్థలాలు క్రమబద్ధీకరణకు చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్: విమానాశ్రయ భూముల్లో 100 గజాల లోపు నివాసాలు ఏర్పాటు చేసుకుని, జీవిస్తున్న వారి భూమిని క్రమబద్ధీకరించి, పట్టాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో కే.చెన్నయ్య తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ స్థలం కొలతలు, మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఉన్న వాటికి పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దాదాపు 800మందికి పైగా 100 గజాల లోపు వారు ఉన్నారని, క్రమబద్ధీకరణకు సంబంధించి 280మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్, ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ అనూరాధ, సెక్రటరీలు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో కే.చెన్నయ్య

టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఎంపికలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో బాల బాలికలు (సీనియర్స్) ఆటల పోటీలు (ఎంపికలు) బుధవారం తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ నీరుకొండ శివ ప్రసాద్‌లు పోటీలను ప్రారంభించారు. 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తిరుముల తిరుపతిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టా నాగేశ్వరరావులు పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లా పలాసలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో వై.లేఖ (లింగపాలెం), ఎం.జయశ్రీ (గోకవరం), ఎం.పూజిత (గోకవరం), కె.మౌనిక (గోకవరం), బాలురు విభాగంలో కె.వంశీ (రాఘవపురం), ఎం.దుర్గారావు (గోకవరం), ఎం.పవన్ కుమార్ (గోకవరం), బి.చంటిబాబు (గోకవరం)లు ఎంపికయ్యారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ

ఆశ్రా అంతర్జాతీయ సదస్సులో జిల్లా ప్రతినిధులకు అభినందనలు



ఆశ్రా అంతర్జాతీయ సదస్సులో జిల్లా ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినియోగదారులు వ్యవహారాల కేంద్ర మంత్రిత్వ శాఖా కార్యదర్శి డాక్టర్ రోహిత్ కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఆశ్రా అంతర్జాతీయ సదస్సులో పశ్చిమ గోదావరి జిల్లా అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నస్ (ఆశ్రా) ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. వినియోగదారుల హక్కులు, వివాదాలు పరిష్కారంలో చేసిన సేవలకు గాను జిల్లా అధ్యక్షుడు కొడాలి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎస్.సత్తిబాబు అవార్డులు అందుకున్నారు. ఈ సదస్సులో అమెరికా, జపాన్, సింగపూర్, ఫ్రాన్స్, కొరియా, దుబాయ్, ఇండోనేషియాతో పాటు 12 రాష్ట్రాల ప్రతినిధులు హాజరైయారు. ప్రముఖ నటుడు ఆలీ, సతీమణి జుబేదా, మిమిక్రి ఆర్టిస్టు శివారెడ్డి, రేరా చైర్మన్ సత్యనారాయణలు హాజరై ప్రతినిధులకు పురస్కారాలు అందజేశారు.

గూడెం మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ చెన్నయ్య

తాడేపల్లిగూడెం అర్బన్:తాడేపల్లిగూడెం మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కె చెన్నయ్యను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయతోపాటు భీమవరం, పాలకొల్లు మున్సిపాల్టీలకు స్పెషలాఫీసర్లను నియమించింది. 2024 మే 5వ తేదీ వరకు ఈ నియామకపు ఉత్తర్వులు అమలులో ఉంటాయి. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కె చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్‌తోపాటు కార్యాలయ విభాగాల అధికారులతో సమన్వయంతో మెరుగైన పాలన అందించేందుకు కార్యాచరణ రూపందిస్తామన్నారు. పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

స్టార్ రేటింగ్ పరికరాలతో విద్యుత్ ఆదా



నిట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ సుమంత్

తాడేపల్లిగూడెం: ఏసీ, టీవీ, ప్రింటర్, ఫ్రిజ్, కంప్యూటర్లు వంటి వాటిని స్టార్ రేటింగ్ ఉన్న వాటిని తీసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని రాష్ట్ర శక్తి పరిరక్షణ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ సుమంత్ అన్నారు. ప్రమాణాలు, లేబులింగ్ అనే విషయంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శక్తి పరిరక్షణ మిషన్ ప్రాజెక్టు, నిట్ సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. విద్యుత్తును పొదుపు చేసే గృహోపకరణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీన్ అకడమిక్ టి.కురుమయ్య, తేజావతురమేష్, పెద్దపాటి శంకర్, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం...చదివిద్దాం

ఇరగవరం: మండలంలోని రేలంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు ఐసీడీఎస్ పీవో ప్రమోదిని మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం...చదివించాలని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ చైల్డ్ మ్యారేజ్ కమిటి, గ్రామ కార్యదర్శి టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రానున్న ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్‌ఏ) అంతా తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఏలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ బూత్ పరిధిలో ఉన్న ఓటర్లకు సంబంధించి పూర్తి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు నమోదు చేయించే దిశగా బీఎల్‌ఏలు కృషి చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా దొంగ ఓట్లు నమోదు ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని, ఓట్లు తొలగింపునకు సంబంధించి సక్రమమా, అక్రమమా అనే విషయాన్ని కూడా పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా సక్రమమైన ఓటు తొలగించబడితే వెంటనే గమనించి బీఎల్‌ఓల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

వైభవంగా భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఉంగుటూరు: వేదమంత్రోచ్ఛరణ నడుమ గోపినాథపట్నంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో విశేష పూజలు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మూడో రోజైన బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పంచామృతాలతో క్షీరాభిషేకం మంత్రి కొట్టు సత్యనారాయణ నిర్వహించారు. ఈ పూజలన్నీ భక్తాంజనేయస్వామి, ఆయన వాహనమైన ఒంటె, సీతారామలక్ష్మణ విగ్రహాలకు నిర్వహించారు. ఆగమ వాచస్పతి డా.వేదాంతం రాజగోపాల చక్రవర్తి బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. ఆరుగురు వేదాంత సంస్కృతి పండితులు రామాయణ పారాయణం నిర్విరామంగా చేస్తున్నారు. 32 మంది ద్వారకాతిరుమల నుంచి ప్రత్యేకంగా వచ్చిన రుత్వికులు హోమాలు నిర్వహించారు. గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో శానిటేషన్ చేయిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల ఈవోలు, ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. గోపినాథపట్నంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అభిషేకాలు నిర్వహిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

1న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 16 బాల బాలికల చదరంగం సెలక్షన్ పోటీలు స్థానిక మాగంటి అన్నపూర్ణ కల్యాణ మండపం హాల్‌లో డిసెంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ సీహెచ్ ఆర్‌కే వర్మ తెలిపారు. పోటీలలో అండర్ 6, 8, 10, 12, 14, 16 విభాగాల్లో జరుగుతాయన్నారు. ప్రతి కేటగిరి నుంచి మొదటి స్థానం సాధించిన క్రీడాకారులు జిల్లా తరుపున భీమవరంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. క్రీడాకారులు 1వ తేదీ ఉదయం 9 గంటలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్ఎస్ చంద్రశేఖర్ అకాడమీ సెక్రటరీ 94408 67370ను సంప్రదించాలని కోరారు.